

'శని'

# మనిషి-రాక్షసి

రాత్రి తొమ్మిది కావస్తుంది. బయట సన్నగా తుంపర పడుతున్నట్టుంది. కన్సల్టింగ్ రూమ్ కిటికీమీద నీటి చుక్కలు అందంగా జారుతున్నాయి. అప్పుడప్పుడూ వార్డులో పేషంట్ల దగ్గులు, సిస్టర్ నడిచినట్టు బూట్లశబ్దం తప్ప అంతా నిశ్శబ్దంగా ఉంది.

డ్రైవర్‌ను స్టేట్ ఎక్స్‌ప్రెస్ సిగరెట్ పాకెట్ తెమ్మని పంపించాను. ఇంకా రాలేదు. డైనింగ్ టేబుల్‌మీద అన్నీ అమర్చి వనజ నాకోసం ఎదురు చూస్తూ ఉంటుంది. విసుగ్గా టైం చూసుకున్నాను మరోసారి.

పెద్దబ్బాయి ఫ్రెండ్స్‌తోకలిసి గోవా

వెళ్ళాడు సైకిల్ మోటర్ మీద. "నాకీ ఫియట్ బోర్ కొడుతూంది డాడీ. మా క్లాస్‌మేట్ బర్త్‌డే ఇవాళ,'' అని నా చెవర్లెట్ తీసుకెళ్ళింది రాణి. ఒంటరిగా కూర్చుంటే ఆలోచనల మెట్లెక్కుతూ పైపైకి పోవడం నా కలవాటు. ఇప్పుడూ అలాగే జరిగింది - బోలెడంత ఆస్థి, దానికి తగ్గట్టు సంఘంలో పలుకుబడి, అంతస్థూ, చుట్టుపక్కల నాలుగయిదు జిల్లాలలోనే ఇంత పెద్ద డాక్టరు లేడనే కీర్తి, లయన్స్ క్లబ్‌లో మెంబర్‌షిప్, ప్రతి ఆదివారం మేజర్ భార్గవ్‌తో గోల్ఫ్ ఆడటం - ఓహ్ ! నేనెంత అదృష్టవంతుణ్ణి.

ఆలోచనలకు ఆటంకం కలిగిస్తూ స్వింగ్ డోర్ తెరుచుకొని ఒక యువతి లోనికి వచ్చింది. చూడగానే గ్రహించ గలిగాను ఆమె గర్భవతి అని.

భుజం నిండుగా కొంగు కప్పుకొని బిడియంగా నిలబడింది ఆమె.

"కూర్చోండి", అన్నాను.

నెమ్మదిగా వచ్చి కుర్చీలో కూర్చుంది.

"చెప్పండి", అన్నాను.

ఆమె మాట్లాడలేదు.

నాకెలా ప్రొసీడ్ అవాలో తెలియ లేదు. అరనిముషంసేపు ఆగి మళ్ళీ అన్నాను. ''మీరు సంకోచంలేకుండా నాతో మాట్లాడవచ్చు."

ఆమె జవాబివ్వలేదు. తల ఎత్తి నా వైపు సూటిగా చూసింది. కళ్ళనిండా నీళ్లు.

నాకర్థమయింది. ఇటువంటి కేసులు నాకు కొత్తకాదు. రక్తం పరుగులిడే వయసులో, పరిణతి చెందని మనసుతో, తొందరపాటులో చేతులు కాల్చుకుం టారు. తీరా విషయం తెలిసాక ఆ ప్రబుద్ధుడు "ఇంకేమైనా ఉందా ! మా నాన్న చంపేస్తాడు" అనో, "కట్నం లేకుండా పెళ్లంటే మా నాన్న ఒప్పు కోడు రాధా !" అనో చల్లగా జారు కుంటాడు. చేసేదేమీలేక పాపం ఆ అమ్మాయి అబార్షన్‌కని ఏ డాక్టర్ కాళ్లో పట్టుకుంటుంది. ఆ ధైర్యమూ లేనివాళ్లు ఆత్మహత్యకైనా వెనుకాడరు.

నో. ఈసారి అలా జరగటానికి వీల్లేదు — నా పిడికిలి బిగుసుకుంది.

"అతని పేరేమిటో చెప్పమ్మా", అన్నాను.

మంచితనం, మానవత్వం వదిలి మనుషులెందుకు ఇలా హీనంగా తయా రవుతారు ? కేవలం లౌకికమైన, హేయ మైన కారణాలకు సంస్కారం మరిచి పోయి, అమాయకులైన అబలల జీవి తాలతో ఎందుకిలా ఆడుకుంటాడు మగ వాడు ? ఇదేనా మహాత్ముడు కలలు గన్న మన దేశం ?

నిట్టూర్చాను. ఈ కథ ఇలా ముగియటానికి వీల్లేదు. రేపే వెళ్ళి కావలసినంత డబ్బు అతని ముఖాన

కొట్టి, ఇద్దరికీ పెళ్ళి ఘనంగా జరిపిస్తాను. మనిషికి కావలసింది మనసు, మానవత్వం అని నిరూపిస్తాను.

టేబిల్ మీదుగా కొద్దిగా ముందుకి వంగి అన్నాను. "చెప్పమ్మా, భయం లేదు. నీ తండ్రిలాంటివాణ్ణి. అతని పేరేమిటి? ఎక్కడుంటాడు ?"

ఒక్క క్షణం ఆమె కళ్లు ఆశతో వెలిగాయి.

"ఫరవాలేదు. ధైర్యంగా చెప్పు."— భరోసాగా ఆమె చేతిని తాకుతూ అన్నాను.

ఆమె ఒక్క క్షణం ఆగి అన్నది. "రవి...రవిబాబు..."

షాక్ తిన్నట్టు ఫీలయ్యాను. రవి మా పెద్దబ్బాయి.

"నేను, రవి ఒకే కాలేజీలో చదువు కుంటున్నాము. రెండు సంవత్సరాల క్రితం మా పరిచయం అయింది..." ఆమె చెప్పుకుపోతూంది. నా మెదడు పని చెయ్యడం మానేసింది. గొంతు తడారిపోయింది. పైన ఫాన్ తిరుగుతూనే ఉన్నా ఒళ్లంతా చెమటలు పట్టాయి.

ఇప్పుడేం చెయ్యాలి ? ఈ అమ్మాయి కులమేమిటో అంతస్తు ఏమిటో ... ఈ విషయం రేపు నలుగురికీ తెలిస్తే నా పరువు ఏంకావాలి ? లయన్స్ క్లబ్ మీటింగ్‌లో ఎలా తలెత్తుకొని తిరగాలి ? వచ్చే ఆదివారం మేజర్ భార్గవ్‌తో ఏ ముఖంపెట్టుకొని గోల్ఫ్ ఆడాలి ?

ఓహ్ ! నా తల తిరిగిపోతూంది.

చటుక్కున చేయి కోటు జేబులోకి పోయింది. చేతికి అందినంత డబ్బు బయటికి తీసి ఆమె చేతిలో పెట్టాను.

ఆమె నిర్ఘాంతపోయింది.

"దయచేసి మళ్ళీ నాకూ, మా వాడికీ కనిపించకు. నీకు కావలసినంత డబ్బు ఇస్తాను...దూరంగా వెళ్ళిపో... "ప్లీజ్ ఎక్స్‌క్యూజ్ మీ." నా మాటలు తడబడ్డాయి రుమాలుతో ముఖాన పట్టిన చెమట తుడుచుకున్నాను.

ఒక్క క్షణం ఆమె నావంక సూటిగా చూసింది. అందులో వ్యక్తమైంది అసహ్యమో, కోపమో నాకర్థంకాలేదు. కాని నా శరీరంలో ఏవో మంటలు చెలరేగి కాల్చుతున్నట్టు అనిపించింది.

ఆమె వెళ్ళిపోయింది.

ఫాన్ గాలికి టేబుల్ మీద పెట్టిన నోట్లు చిందరవందరగా గదంతా ఎగురుతున్నాయి

